

చట్టాలపై అవగాహన
దేశంలో కొత్తగా అమల్లోకి వచ్చిన నేర చట్టాలపై శ్రీసిటీలో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. - 8లో



చదువును మళ్లీ కొనసాగిద్దాం
ఆగిపోయిన చదువును మళ్లీ కొనసాగించేందుకు దూర విద్యా విధానాన్ని ప్రభుత్వం అందు బాటులోకి తీసుకొచ్చింది. - 8లో



భోజనంలో బొద్దింక ప్రత్యక్షం
చంద్రగిరిలోని హోటల్లో వినియోగదారుడు భోజనం చేస్తుండగా బొద్దింక కనిపించడంతో అవాక్కయ్యాడు. - 8లో

న్యూస్‌రీల్

బిందు పరికరాలపై రాయితీ



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్: సూక్ష్మ సాగు నీటి పథకం ద్వారా బిందు సేద్యం పరికరాలపై రాయితీని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఎస్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. ఆయన శనివారం మీడియాతో మాట్లాడుతూ డ్రిప్ పరికరాలు 5 ఎకరాల్లోపు రైతులకు 90శాతం, 5 ఎకరాల పైన రైతులకు 70శాతం, స్ప్రింక్లర్లు 5 ఎకరాల్లోపు రైతులకు 55శాతం, 5 ఎకరాల కంటే ఎక్కువగా ఉన్న రైతులకు 45శాతం రాయితీలతో పరికరాలను అందిస్తారని చెప్పారు. జిల్లాలో ఈ ఏడాదికి ఆరువేల హెక్టార్లలో పరికరాలను ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న రైతులు దరఖాస్తు చేసుకోవడానికి ఆధార్‌కార్డు, తహసీల్దార్ ధ్రువీకరించిన భూమి యాజమాన్య పత్రం, 1బీ రికార్డులతో రైతు భరోసా కేంద్రాల నుంచి దరఖాస్తు చేసుకునే సౌకర్యం ఉందని చెప్పారు. ఉద్యానశాఖకు సంబంధించి ఆయిల్ పామ్, పండ్లు, కూరగాయలు, పూల మొక్కలు, కోల్డ్ రూమ్‌లు నిర్మాణానికి పలు పథకాల ద్వారా రాయితీలు ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

టీటీడీ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ అధికారిగా శ్రీధర్



తిరుమల: టీటీడీ చీఫ్ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ అధికారిగా ఎస్.శ్రీధర్‌ను నియమిస్తూ ఏపీ చీఫ్ సెక్రటరీ నీరబ్ కుమార్ శనివారం ఆదేశాలు జారీ చేశారు. తిరుమలలో పనిచేస్తున్న సీవీఎస్‌ఓ నరసింహ కిషోర్ ఇటీవల బదిలీపై వెళ్లడంతో అప్పటినుంచి ఈ పోస్టు ఖాళీగా ఉంది. వెయిటింగ్‌లో ఉన్న శ్రీధర్‌ను ఆ స్థానంలో నియమించారు.

హద్దు మీరితే చర్యలు తప్పవు

సాక్షి ఎఫెక్ట్..

వాకాడు : ఆంధ్రా సముద్ర జలాలపై కొన్ని పొరుగు రాష్ట్రాలకు చెందిన స్పీడు బోట్లు హద్దులు దాటి మత్స్య సంపదను దోచుకునిపోవడం, అడ్డొచ్చిన మత్స్యకారులపై దాడులు చేయడం వంటి ఘటనలపై శుక్రవారం హద్దు మీరి.. మీనం చోరీ అన్న శీర్షికన సాక్షి దిన పత్రికలో కథనం ప్రచురితమైంది. దీనిపై జిల్లా మత్స్య శాఖ అధికారులు శనివారం స్పందించారు. మత్స్యశాఖ జేడీ నాగరాజ మాట్లాడుతూ పాండిచ్చేరి, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన పెద్ద బోట్లు ఎంఎఫ్ఆర్ఐ యాక్ట్ నిబంధనలకు వ్యతిరేకంగా ఆంధ్రా జలాల్లో చొరబడుతున్న విషయం వాస్తవమేనన్నారు. తమిళనాడుకు చెందిన 5 బోట్ల వివరాలను పాండిచ్చేరి, తమిళనాడుకు చెందిన అధికారులకు తెలియజేసి వారిపై చర్యలు తీసుకోవాలని కోరినట్లు వెల్లడించారు. ఇదే విషయమై కరైకల్, కడలూరు, నాగపట్నం, పాండిచ్చేరి జిల్లాకు చెందిన అధికారులను సంప్రదించి అక్కడ స్థానిక మత్స్యకార గ్రామాల ప్రజలతో సమావేశాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. దాదాపు 20–25 ఏళ్ల నుంచి కొనసాగుతున్న ఈ సమస్యకు త్వరలోనే శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

గెస్ట్ టీచర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి ఎడ్యుకేషన్ : జిల్లాలోని గురుకుల విద్యాసంస్థల్లో 2024–25 విద్యా సంవత్సరంలో ఇంగ్లీష్ మీడియంలో వివిధ సబ్జెక్టుల బోధనకు గెస్ట్ టీచర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈ మేరకు గురుకులాల జిల్లా సమన్వయాధికారి టి.పద్మజ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు బీఎడ్‌తో పాటు టెట్‌లో అర్హత సాధించి ఉండాలని, సంబంధిత పీజీలో 55 శాతం మార్కులు, బీఎడ్‌లో సంబంధిత సబ్జెక్టులో మెథడాలజీ కలిగి ఉండాలని సూచించారు. ఆసక్తి, అర్హత ఉన్న అభ్యర్థులు ఈ నెల 6వ తేదీ సాయంత్రం 5గంటల్లోపు దరఖాస్తులను జిల్లా సమన్వయాధికారి, ఏపీఎస్‌డబ్ల్యూ ఆర్‌ఈఐ సొసైటీ, తిరుపతిలో స్వయంగా అందించాలని తెలిపారు. ఈ నెల 7వ తేదీ ఉదయం 10గంటల నుంచి పుదురులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాలలో డెమో తరగతులు నిర్వహించి ప్రతిభ కలిగిన వారిని ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.

సబ్జెక్టుల వారీగా ఖాళీల వివరాలు

మహిళలు : జూనియర్ లెక్చరర్ మ్యాథ్స్–1, జూనియర్ లెక్చరర్ కెమిస్ట్రీ–1, జూనియర్ లెక్చరర్ సివిక్స్–1, జూనియర్ లెక్చరర్ ఎకనామిక్స్–1, జూనియర్ లెక్చరర్ కామర్స్–1, టీజీటీ హిందీ–1, టీజీటీ ఇంగ్లీష్–1, టీజీటీ మ్యాథ్స్–1, టీజీటీ సోషియల్ స్టడీస్–1, పీఈటీ–1, హెల్త్ సూపర్‌వైజర్–1

పురుషులు: జూనియర్ లెక్చరర్ మ్యాథ్స్ –1, పీజీటీ మ్యాథ్స్–1, పీజీటీ ఫిజికల్ సైన్స్–1, హెల్త్ సూపర్‌వైజర్–1

సాలు పంటలు సాలించారే..!



గతంలో వేరుశనగ పంట మధ్యలో సాగైన సాలు పంట



వేరుశనగలో సాగు చేసిన సాలు పంట (ఫైల్)

అసలు పంట ఆదుకోకున్నా కొసరు పంటలు ఆదుకుంటాయనేది పెద్దలు చెప్పే సామెత. ఒకప్పుడు ఏటా ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగతో పాటు సాలు పంటలు వేయడం ఆనవాయితీ. సాలు పంటల్లో ముఖ్యంగా కందులు, జొన్నలు, అలసంద, పెసలు, అనప తదితర పంటలు సాగు చేసేవారు. సరైన వర్షాలు లేక వేరుశనగ పంట దెబ్బతిన్నా..సాలు పంటలు రైతులను ఆదుకునేవి. ఒక పంటలో నష్టం చవిచూస్తే సాలు పంటలు ఆ నష్టాన్ని పూడ్చేలా ఉండేవి. ఇవి రైతులకు ఉభయకారిగా ఉండేవి.

- వేరుశనగ చేలల్లో కనిపించని సాలు పంటలు
- భారీగా తగ్గిన చిరుధాన్యాల సాగు
- ట్రాక్టర్లతో విత్తనాలు వేస్తుండడంతో సాలు పంటలపై తగ్గిన మక్కువ
- ప్రస్తుతం మార్కెట్‌లో చిరుధాన్యాలకు డిమాండ్
- మారిన జీవనశైలి కారణంగా పౌష్టికాహారం తీసుకోవడానికి ఇష్టపడుతున్న జనం
- సాలు పంటలపై ప్రభుత్వ ప్రోత్సాహం కరువు
- సాలు పంటల సాగుకు ప్రోత్సాహం అందించాలంటున్న రైతులు

పలమనేరు/చిత్తూరు అగ్రికల్చర్: గతంలో ఎద్దుల మడకతో తొలుత సాలు దున్ని అందులో రకరకాల సాలు విత్తనాలేసి ఆపై వేరుశనగ విత్తనాలేసేవారు. క్రమంగా కాడెద్దులు కరువై ట్రాక్టర్ల రాకతో మొత్తం వేరుశనగ తప్ప సాలు పంటలు వేసే వారు లేరు. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో జీవన ప్రమాణాలు మారాయి. ఇప్పుడు అంతా మిల్లెట్ ఫుడ్‌కు అలవాటు పడుతున్నారు. ఒకప్పుడు మన పెద్దలు తిన్న రాగి, కొర్రన్నం, సామలు, అలసందలు, పెసలు వంటి చిరుధాన్యాలతో చేసిన ఆహారం తీసుకోవడానికి ఇష్టపడుతున్నారు. ఉరుకుల పరుగుల జీవితంలో బీపీ, షుగర్ వంటి రోగాలు అందరికీ సర్వసాధారణమయ్యాయి. దీంతో చాలామంది మిల్లెట్స్‌తో చేసిన వాటినే తింటున్నారు. హోటళ్లలో కూడా ఈ మధ్య రాగి, జొన్న, సజ్జలు, కొర్రలతో చేసిన వంటకాలు లభిస్తున్నాయి.

ఘుమఘుమలాడే వంటలు..

గతంలో రైతుల ఇళ్లల్లో చిరుధాన్యాల వంటకాలు ఘుమఘుమలాడేవి. అవి పౌష్టికాహారం గనుక నాడు రైతులు పొలంలో చెమట చిందించి పంటలు పండించే శక్తి ఉండేది. అప్పట్లో కూరలు సైతం ఎంతో రుచిగా ఉండేవి. రాగిముద్దలోకి అనపకాయలు, ఎండుకందులు, అలసంద గింజల చారు చేసుకుంటే నోట్లో నీళ్లూరేవి. ఎలాంటి పురుగు మందులు లేకుండా ఇవి పండేవి. దీంతో మనుషులు ఆరోగ్యంగా ఉండేవారు. ఇవన్నీ పెద్దలు నేటి తరాలకు నేర్పిన ఆరోగ్య సూత్రాలే. కానీ గత పది, పదిహేనేళ్లుగా సాలు పంటలను రైతులు సాలించేశారు. వాటి సాగు విస్తీర్ణం ఇప్పుడు వేల ఎకరాల నుంచి పదుల్లోకి చేరింది.

ఇప్పటికే కనుమరుగు..

చిరుధాన్యాల సాగు ఏటా తగ్గిపోతోంది. భవిష్యత్‌లో వీటి జాడ కనుమరుగవుతుందేమోనన్న ఆందోళన నెలకొంది. గతంలో పల్లెల్లో ప్రతి ఇంటా ధాన్యంతో పాటు పలు రకాల చిరు ధాన్యాలు సమృద్ధిగా ఉండేవి. అయితే ప్రస్తుతం వీటి సాగు నామమాత్రంగా మారింది. చిరుధాన్యాల్లో ముఖ్యమైన సజ్జ, సామ, కొర్ర, జొన్న, రాగి విస్తీర్ణం భారీగా తగ్గింది. సాగవుతోన్న వేరుశనగలో కేవలం 1 శాతం మాత్రమే సాలు పంటలుగా వేశారు. ఇక సజ్జ, సామ, కొర్రలు ఎలా ఉంటాయో నేటి తరానికి తెలియకపోవడం బాధాకరం. అత్యధిక పోషకాహార గుణాలు కలిగిన ఈ ధాన్యాలు సాగుకు నోచుకోవట్లేదు.

చిత్తూరు జిల్లాలో చిరుధాన్యాల సాగు పరిస్థితి

పంట	సాధారణ సాగు (ఎకరాల్లో)	ప్రస్తుతసాగు
జొన్న	86	0
కందులు	3261	551
మినుములు	122	30
అలసందలు	540	144
సజ్జ	566	392
రాగి	3101	78
కొర్ర	42	0
సామ	208	15
ఉలవలు	2964	145
నువ్వులు	4	1
పొద్దుతిరుగుడు	1	0
ఆముదం	20	0



గతంలో సాగైన సజ్జ పంట (ఫైల్)

చిరు ధాన్యాలపై నిర్లక్ష్యం..

చిరుధాన్యాలపై రైతులు నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్‌లో ఇబ్బందులు తప్పవు. వీటి సాగును పెంచేందుకు వ్యవసాయ శాఖ చర్యలు తీసుకోవాల్సి ఉంది. కేంద్ర ప్రభుత్వం ఇన్‌సింప్ అనే కార్యక్రమం ద్వారా చిరు ధాన్యాల సాగును పెంచేందుకు కృషి చేస్తోంది. మరోవైపు రాష్ట్రీయ కృషి వికాస్ యోజన ద్వారా చిరుధాన్యాల సాగును చేపట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. కానీ ఈ కార్యక్రమాల అమలు స్థానికంగా అంతంత మాత్రంగానే ఉంది. ఇప్పటికైనా చిరుధాన్యాల విత్తనాలను సబ్సిడీ ద్వారా రైతులకు అందించి మండలంలో చిరు ధాన్యాల సాగు చేపట్టేందుకు స్థానిక వ్యవసాయశాఖ కృషి చేయాల్సిన అవసరం ఉంది.



గతంలో సాగైన జొన్న పంట (ఫైల్)

సాలు పంటలే లేకుండా పోయే..!



ముందంతా చేళల్లో వేరుశనగతో పాటు మునాల్లో సాలు పంటలు వేస్తాంటిమి. వేరుశనగ ఒబ్బిడయ్యాక ఉలవలు వేస్తాంటిమి. డిసెంబర్‌లో పడే మంచుకే పంట పండతావుండె. అప్పుడు ఎద్దుల మడకతో గింజలేస్తాంటిమి. ఇప్పుడు ట్రాక్టర్లకే గింజలేసే పరికరాలు వచ్చాయి. దీంతో రైతులు కూడా సాలు పంటలు సాలిస్తిమి.
– సోమిరెడ్డి, నడిమిదొడ్డిపల్లి, పలమనేరు

చిరుధాన్యాల సాగుకు కృషి చేస్తున్నాం



జిల్లాలో చిరుధాన్యాల సాగు తగ్గుముఖం పడుతున్న మాట నిజమే. ఏటా చిరుధాన్యాల సాగు పెంపునకు వ్యవసాయశాఖ రైతులకు అవగాహన కల్పిస్తోంది. ఉలవ, జొన్నలను సబ్సిడీతో అందిస్తున్నాం. రైతులు కూడా చిరుధాన్యాలు పండించాలని భావించాలి. వీటిల్లో ఉండే ప్రొటీన్స్ మనకు ఎంతోమేలు చేస్తాయి. చిరుధాన్యాల పెంపుపై ప్రత్యేక చొరవ చూపుతాం. – మురళీకృష్ణ, జిల్లా వ్యవసాయ అధికారి, చిత్తూరు

అవయవదానంపై అవగాహన అవసరం



శ్రీ పద్మావతి మహిళా వైద్య కళాశాల వద్ద ర్యాలీ చేస్తున్న అధికారులు, వైద్య విద్యార్థులు

తిరుపతి తుడా: అవయవ దానంపై ప్రతి ఒక్కరికీ పూర్తి అవగాహన అవసరమని టీటీడీ జేఈవో ఎం.గౌతమి అన్నారు. జాతీయ అవయవ దాన దినోత్సవం సందర్భంగా శనివారం స్విమ్స్ శ్రీ పద్మావతి మహిళా వైద్య కళాశాల ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీని నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా విచ్చేసిన టీటీడీ జేఈవో ఎం.గౌతమి మాట్లాడుతూ అవయవ దానంపై చాలామందిలో అపోహలు ఉన్నాయన్నారు. అపోహలు వీడి ప్రాణాపాయ స్థితిలో ఉన్న తమ కుటుంబసభ్యుల అవయవాలను దానం చేసేందుకు ముందుకు రావాలని ఆమె పిలుపునిచ్చారు. మృతి చెందినప్పటికీ అవయవాల దానంతో మరో రూపంలో జీవించవచ్చన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. స్విమ్స్‌లో అవయవాలు, శ్రీ పద్మావతి కార్డియాక్ కేర్ సెంటర్‌లో గుండె మార్పిడి విజయవంతంగా చేపడుతున్నామన్నారు. స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్ వి కుమార్, శ్రీ పద్మావతి కార్డియాక్ కేర్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనాథ్ రెడ్డి మాట్లాడుతూ తమవారు మరణించినా కూడా జీవించే భాగ్యం అవయవ దానం ద్వారా మాత్రమే సాధ్యమవుతుందని చెప్పారను. అవయవ దానం రెండు రకాలుగా ఉంటుందన్నారు. మొదటిది జీవించి ఉన్నప్పుడే కిడ్నీ, లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్, రెండవది బ్రెయిన్ డెడ్ అయిన వారు అవయవాలను దానం చేయవచ్చని చెప్పారు. ఒకరి నుంచి సేకరించిన అవయవాలతో ముగ్గురికి జీవితాన్ని ఇవ్వొచ్చని చెప్పారు. బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తులు సకాలంలో అవయవాలను దానం చేస్తే, వాటిని ఎనిమిది మందికి వినియోగించవచ్చని వివరించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ రామ్, డాక్టర్ అలోక్ సమంత్ రే, డాక్టర్ వెంకటరామిరెడ్డి, డాక్టర్ హరికృష్ణ, డాక్టర్ కృష్ణ సింహారెడ్డి, డాక్టర్ హర్ష, డాక్టర్ కోటిరెడ్డి, డాక్టర్ మాధవి, డాక్టర్ సుధారాణి, డాక్టర్ ఉషా కళావతి, ఇతర వైద్యులు వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

పులికాట్ అభివృద్ధికి కృషి

- పూడికతీత పనులతో పలువురికి ఉపాధి



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్: జిల్లాలోని పులికాట్ సరస్సు అభివృద్ధికి అందరూ సహకరించాలని కలెక్టర్ ఎస్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. ఆయన శనివారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్‌తో పులికాట్ సరస్సుపై సమీక్షించారు. సరస్సు ముఖద్వారం పూడిరాయదరువు వద్ద పూడిక తొలగిస్తే, సముద్రంలోని నీరు సరస్సులోకి వస్తుందని దాంతో మత్స్యకార కుటుంబాలకు ఉపాధి లభిస్తుందని చెప్పారు. మత్స్య, అటవీ శాఖ అధికారులు కలెక్టర్‌కు వివరిస్తూ పులికాట్ సరస్సు ముఖద్వారం పూడికతీతకు సంబంధించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమానంగా నిధులు సమకూర్చే విధంగా రూ.97.09 కోట్లకు సాగరమాల పథకం కింద అనుమతులు వచ్చాయని, అయితే నిధులు విడుదల చేయాల్సి ఉందని చెప్పారు. పులికాట్ సరస్సు ఉత్తరం నుంచి దక్షిణానికి ఏటవాలుగా ఉండడంతో జూన్ నుంచి ఫిబ్రవరి వరకు మాత్రమే పులికాట్‌లో నీరు నిల్వ ఉంటుందని చెప్పారు. తొమ్మిది నెలలు మాత్రమే ఉపాధి లభిస్తోందని, నీరు లేని మార్చి నుంచి మే నెలల్లో ఉపాధి ఉండడంలేదని స్పష్టం చేశారు. పులికాట్ సరస్సు 461 కిలోమీటర్లు విస్తరించి ఉందని, అందులో మన రాష్ట్రంలోనే 400 కిలోమీటర్లు ఉందని, మిగిలిన 61 కిలోమీటర్లు మాత్రమే తమిళనాడులో విస్తరించి ఉందని వివరించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో పెంచల కిషోర్, సూళ్లూరుపేట ఆర్డీవో చంద్రముని, వైల్డ్ లైఫ్ డీఎఫ్‌ఓ శామ్యూల్, జిల్లా మత్స్యశాఖ అధికారి నాగరాజు, జిల్లా పర్యాటకశాఖ అధికారి రూపేంద్రనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంఘమిత్ర తొలగింపునకు టీడీపీ కుట్ర

- ఏకతాటిపై నిలిచిన సంఘాల సభ్యులు
- వీఓ సమావేశాన్ని బహిష్కరించిన మహిళలు
- వెనుదిరిగిన అధికారులు



అధికారులను నిలదీస్తున్న సంఘాల మహిళలు

శ్రీకాళహస్తి రూరల్: ఎన్డీఏ కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి గ్రామాల్లోని స్థానిక టీడీపీ నాయకుల అరాచకాలు ఎక్కువైపోయాయి. పంచాయతీలో పనిచేస్తున్న సంఘమిత్రలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, అంగన్‌వాడీలను తొలగించేలా కుట్రలు చేస్తున్నారు. అందులో భాగంగానే మండలంలోని పుల్లారెడ్డి కండ్రిగ పంచాయతీ సంఘమిత్రను తొలగించేందుకు మండల వెలుగు అధికారులపై ఒత్తిడి తెచ్చారు. అందుకు శనివారం నిర్వహించిన వీవో సమావేశాన్ని వేదికగా చేసుకోవాలని ప్లాన వేశారు. అనుకున్నట్లుగానే ఏపీఎం మునెయ్య, సీసీ మాధవయ్య ఆధ్వర్యంలో స్వయం సహాయక మహిళా సంఘాల వీవో సమావేశం ప్రారంభమైంది. గ్రామంలోని సంఘమిత్ర సుగుణమ్మను తొలగించి, టీడీపీ నాయకులకు అనుకూలమైన మహిళను నియమించుకునేందుకు సమావేశంలో చర్చించారు. అయితే ఊహించని రీతిలో మహిళలంతా ఏకతాటిపై నిలిచి 2016 నుంచి ఉన్న సంఘమిత్రను తొలగించేందుకు అంగీకరించలేదు. మహిళలకు నచ్చ చెప్పేందుకు ఏపీఎం ప్రయత్నించగా, సంఘమిత్రను మారిస్తే తామందరూ సంఘాల నుంచి వైదొలగుతామని తేల్చి చెప్పారు. వెంటనే సమావేశాన్ని బహిష్కరించి వెళ్లిపోయారు. సమావేశంలో నెల వాయిదాను చెల్లించాల్సిన నగదును కూడా మహిళలు కట్టకుండా సమావేశం నుంచి వెళ్లిపోవడంతో అధికారులు చేసేదేమీ లేక అక్కడి నుంచి వెనుదిరిగారు.

రాష్ట్రపతి భవన్ ఎట్ హోమ్‌కు ఎన్‌ఎస్‌యూ వీసీ



సంస్కృత వర్సిటీ వీసీ జీఎస్‌ఆర్ కృష్ణమూర్తి

తిరుపతి సిటీ: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈ నెల 15న ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో నిర్వహించనున్న ఎట్ హోమ్ కార్యక్రమానికి జాతీయ సంస్కృత వర్సిటీ వీసీ ప్రొఫెసర్ జీఎస్‌ఆర్ క్రిష్ణమూర్తికి అవకాశం దక్కింది. ఈ మేరకు రాష్ట్రపతి కార్యాలయం నుంచి ఆయనకు శనివారం ఆహ్వానం అందినట్లు వర్సిటీ అధికారులు తెలిపారు. అరుదైన గౌరవం దక్కడంపై వీసీని వర్సిటీ అధికారులు, అధ్యాపకులు అభినందించారు.

ఆర్టీసీ అంటేనే సురక్షితం



ఆర్టీసీ సిబ్బందికి గులాబీలు అందిస్తున్న డీపీటీఓ చెంగల్‌రెడ్డి

తిరుపతి అర్బన్: ఆర్టీసీ సర్వీసులు అంటేనే సురక్షితమని ప్రయాణికులు భావిస్తున్నారని జిల్లా ప్రజా రవాణా అధికారి(డీపీటీఓ)చెంగల్ రెడ్డి తెలిపారు. ఈ పేరును ఇలాగే నిలబెట్టాలని కోరుతూ ఆయన శనివారం రాత్రి అలిపిరి, మంగళం డిపోల్లో డ్రైవర్లతో పాటు కండక్టర్లు, గ్యారేజ్ సిబ్బందికి గులాబీ పూలను అందించారు. జిల్లాలో 11 డిపోలు ఉన్నాయి. అందులో 911 ఆర్టీసీ సర్వీసులు రోజు 3.44 లక్షల కిలోమీటర్ల దూరం నడుస్తున్నట్లు చెప్పారు. తిరుపతి జిల్లాలో 1,450 మంది కండక్టర్లు, 1,788 డ్రైవర్లు, 538 మంది మెకానిక్స్ పని చేస్తున్నారని వెల్లడించారు. బస్సుల కండీషన్ పరిశీలించడంలో మెకానిక్స్ పాత్ర కీలకమన్నారు. డ్రైవర్లు ట్రాఫిక్ నియమాలను పాటిస్తూ క్షేమంగా సర్వీసులను నడపాల్సి ఉందని చెప్పారు. ఆర్టీసీపై నమ్మకంతో బస్సులో ప్రయాణిస్తున్న సంగతిని గుర్తు పెట్టుకోవాలని వివరించారు. గూడూరు సంఘటనలు పునరావృతం కాకుండా బాధ్యతగా ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ ఎం.భాస్కర్, డిప్యూటీ చీఫ్ మెకానిక్ ఇంజినీర్ నరసింహులు, అలిపిరి, తిరుపతి, మంగళం డిపో మేనేజర్లు పాల్గొన్నారు.

సెల్ఫ్ సపోర్టింగ్ కోర్సు దరఖాస్తుల గడువు పొడిగింపు

తిరుపతి సిటీ : ఎస్వీయూ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ బీటెక్ సీఎస్‌ఈ సెల్ఫ్ సపోర్టింగ్ కోర్సుకు దరఖాస్తుల గడువును ఈ నెల 9వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు రిజిస్ట్రార్ ఎం భూపతినాయుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ ఈఏపీసెట్–2024లో ర్యాంక్ సాధించిన అభ్యర్థులు వర్సిటీలోని డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ కార్యాలయంలో 9వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 12వ తేదీన కౌన్సెలింగ్, సీట్లు కేటాయింపు ఉంటుందని పేర్కొన్నారు. వివరాలకు వర్సిటీ అధికారిక వెబ్‌సైట్ చూడాలని సూచించారు.

• పురిటి బిడ్డకు ఊపిరందక...



పురిటి బిడ్డకే సిలిండర్ నుంచి ఆక్సిజన్ అందించాల్సి వస్తోంది. ఊపిరి సరిగా ఆడని పసికందును ఇలా ఆక్సిజన్ సిలిండర్‌తో కలిపి మండు టెండలో వైద్యం కోసం తీసుకెళుతున్న దృశ్యం శనివారం తిరుపతి రుయాలో కనిపించింది. ఈ పసికందు భూ లోకంలోకి రాగానే ఒక వైపు ప్రకృతి, మరోవైపు ఆస్పత్రి పగ బట్టాయని చెప్పే చిత్రమిది. – సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

క్లుప్తంగా

భోజనంలో బొద్దింక ప్రత్యక్షం

- నిర్లక్ష్యంగా వ్యవహరించిన పవిత్ర హోటల్ యాజమాన్యం
- సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన వైనం

చంద్రగిరి: టీవల తిరుపతి ఆధ్యాత్మిక నగరంలోని పీఎస్-4 హోటల్లో వినియోగదారుడు తింటున్న అన్నంలో జెర్రి ప్రత్యక్షమైన ఘటన మరువక ముందే, చంద్రగిరిలో భోజనంలో బొద్దింక ప్రత్యక్షం కావడం కలకలం రేపింది. చంద్రగిరి కొత్తపేటలోని అంకాళమ్మ ఆలయ సమీపంలో పవిత్ర హోటల్‌లో స్థానికులు శనివారం మధ్యాహ్నం భోజనం చేసేందుకు వెళ్లారు. ఈ క్రమంలో అన్నంతో పాటు మజ్జిగ కలిపి తినే సమయంలో భోజనంలో బొద్దింక ప్రత్యక్షం కావడంతో అవాక్కయ్యారు. వెంటనే వినియోగదారులు ఇదేమిటంటూ హోటల్ నిర్వాహకులను ప్రశ్నించారు. ఇష్టముంటే తినండి..లేకుంటే వెళ్లండంటూ హోటల్ నిర్వాహకులు వినియోగదారులపై ఎదురుదాడికి దిగారు. దీంతో ఆగ్రహానికి గురైన వినియోగదారుడు భోజనంలో బొద్దింకను వడ్డించారంటూ ఫొటోలను సోషల్ మీడియాలో వైరల్ చేశాడు. స్థానికంగా మంచి పేరున్న పవిత్ర హోటల్లో ఇలాంటి ఘటనలు చోటు చేసుకోవడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ ఘటనపై చంద్రగిరి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కుసుమను వివరణ కోరగా, ఇటువంటి ఘటనలతో తమకు సంబంధం లేదని, తిరుపతి ఫుడ్‌సేఫ్టీ అధికారుల పరిధిలోకి వస్తుందని సమాధానం చెప్పారు.

మాకొద్దు బాబోయ్.. చంద్రగిరి !

- అక్రమాలకు అడ్డు చెప్పరాదని అధికారపార్టీ హుకుం
- హద్దు మీరితే ఇబ్బందులు తప్పవంటున్న ప్రతిపక్షం
- భవిష్యత్తులో తమకు దిక్కెవరు?
- ఇప్పటికే 160 మంది అధికారులకు లీగల్ నోటీసులు
- నియోజకవర్గంలో పోస్టింగ్‌కు వెనకడుగు వేస్తున్న అధికారులు

తిరుపతి రూరల్: చంద్రగిరి నియోజకవర్గం.. తిరుపతి మహానగరానికి మూడు వైపుల విస్తరించి ఉన్న ప్రాంతం. తిరుపతికి కూతవేటు దూరంలోనే విధులు నిర్వర్తించే అవకాశం ఉండడం, ఆధ్యాత్మిక నగరంతో పాటు విద్య, వైద్యం వంటి కార్పొరేట్ స్థాయి సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. అత్యంత నివాసయోగ్యం కూడా కావడంతో ఈ నియోజకవర్గంలో విధులు నిర్వర్తించేందుకు ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు ఉత్సాహం చూపుతారు. చట్టాన్ని గౌరవిస్తూ, అర్హతే ప్రామాణికంగా పనిచేసే అధికారులకు ఈ నియోజకవర్గం చాలా సౌకర్యవంతమైనది. నిబంధనలను అతిక్రమించి, అధికార మత్తుకు దాసోహం అవుతూ అవినీతి, అక్రమాలకు పాల్పడే వారికి మాత్రం ఇబ్బందులు తప్పవని చరిత్ర చెబుతోంది. గత 59 రోజుల్లో ఇలా నిబంధనలను అతిక్రమించిన 160 మంది అధికారులకు మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి లీగల్ నోటీసులు పంపించారు. ప్రస్తుతం బదిలీల సీజన్ నడుస్తున్న క్రమంలో చంద్రగిరి నియోజకవర్గంలో పనిచేసేందుకు అధికారులు వెనకడుగు వేస్తున్నారు.

ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం చేసినా పట్టించుకోలేదు

ప్రభుత్వ నిధులతో నిర్మించిన భవనాలు, అందులోని ఫర్నిచర్, ఆస్తులను టీడీపీకి చెందిన కొందరు నేతలు, కార్యకర్తలు ధ్వంసం చేశారు. ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత ఈ దాడులు, విధ్వంసాలు ఎక్కువగా చోటుచేసుకున్నాయి. బహిరంగంగానే కొందరు ప్రభుత్వ భవనాలు, సచివాలయాల పైకి ఎక్కి మరీ శిలాఫలకాలు, నేమ్ బోర్డులను ధ్వంసం చేశారు. నియోజకవర్గ ప్రజల సౌకర్యం కోసం తుడా నిధులతో ఏర్పాటు చేసిన సిట్టింగ్ బెంచ్‌లను సైతం విరిచేశారు. కొత్తగా వేసిన సీసీరోడ్ల వద్ద ఏర్పాటు చేసిన శిలాఫలకాలను విరగ్గొట్టారు. జగనన్న సమావేశ మందిరాలను కూల్చివేశారు. బహిరంగంగా బరితెగిస్తున్నా కూడా కొందరు అధికారులు, ఉద్యోగులు కనీసం అడ్డుకునే ప్రయత్నం కూడా చేయలేదు. నియోజకవర్గం ప్రజాప్రతినిధి మెప్పు పొందేందుకు కొందరు అధికారులే శిలాఫలకాలను ధ్వంసం చేయడం గమనార్హం. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పలు పార్టీల ప్రతినిధులు ఇది మంచి పద్ధతి కాదని వారించినా వినలేదు. దీంతో విధుల్లో నిర్లక్ష్యంగా ఉండటం, ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేస్తున్నా పట్టించుకోని పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అధికారులు, మండల ప్రజాపరిషత్ అధికారులపై మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కోర్టుకు వెళ్లారు. 160 మంది అధికారులకు కోర్టు ద్వారా లీగల్ నోటీసులను పంపించారు. దీంతో అప్పటి వరకు అధికార పార్టీకి, నేతలకు ఊడిగం చేసిన అధికారులు ఉలిక్కిపడ్డారు. అడ్డదిడ్డంగా వెళ్లితే న్యాయస్థానాల ముందు దోషిగా నిలబడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎక్కడ తమ ఉద్యోగాలకు ఎసరు వస్తుందేమోనని ఆందోళన చెందుతున్నారు. నిబంధనలు పక్కన పెట్టి, తమకు అనుకూలంగానే వ్యవహరించాలని అధికార పార్టీ నేతలు బెదిరిస్తున్నారని చెబుతున్నారు. వారు చెప్పినట్లు చేస్తే న్యాయపరమైన చిక్కులు ఎదుర్కోవాల్సి వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రశాంతంగా ఉద్యోగం చేసుకుంటే చాలు, మాకు చంద్రగిరి వద్దురా బాబు.. అంటూ పలువురు అధికారులు, ఉద్యోగులు తిరుపతి, శ్రీకాళహస్తి, వెంకటగిరి, గూడూరు నియోజకవర్గాల వైపు చూస్తున్నట్లు సమాచారం.



160 మందికి లీగల్ నోటీసులు

అధికార మత్తును తలకెక్కించుకుని అంతా మా ఇష్టం.. అన్న రీతిలో విర్రవీగిపోతున్న టీడీపీ శ్రేణులు తానా అంటే కొందరు అధికారులు తందానా అంటున్నారు. పచ్చమంద పైశాచికత్వానికి ఇంకొందరు ఉద్యోగులు వంతపాడారు. ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేస్తున్నా, ఎలాంటి హోదాలు లేకపోయిన వారు సైతం అధికారాన్ని వెలగబెడుతున్నా పట్టించుకోలేదు. నియోజకవర్గ ప్రజాప్రతినిధి మెప్పు పొందేందుకు ఇష్టారాజ్యంగా వ్యవహరించిన అధికారులు ప్రస్తుతం న్యాయస్థానం ముందు చేతులు కట్టుకునే పరిస్థితి వచ్చింది. ఒకరు, ఇద్దరు కాదు.. అధికార పార్టీకి కొమ్ముకాస్తూ నిబంధనలను అతిక్రమించిన ఏకంగా 160 మంది అధికారులు లీగల్ నోటీసులు అందుకున్నారు. పంచాయతీ కార్యదర్శి నుంచి పంచాయతీ రాజ్ శాఖ ఇంజనీరింగ్ అధికారులు, తుడా అధికారులు, ఇంజనీర్లు, మండల ప్రజాపరిషత్ అధికారులు ఉన్నారు.

చట్టాలపై అవగాహన

శ్రీసిటీ(సత్యవేడు): దేశంలో కొత్తగా అమలులోకి వచ్చిన నేర చట్టాలపై శనివారం శ్రీసిటీలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో ముఖ్య అతిథిగా మాజీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, ప్రస్తుత కార్పొరేట్ సంస్థలకు క్రిమినల్ చట్టాలపై న్యాయ సలహాదారు ఇ.దామోదర్ పాల్గొన్నారు. నూతన నేర చట్టాలలోని పలు కీలక అంశాలపై వివరించారు. అరెస్టు చట్టాల దుర్వినియోగాన్ని నిరోధించడానికి పర్యవేక్షణ, ఎలక్ట్రానిక్ ఎఫ్ఐఆర్‌లను ప్రవేశపెట్టడం, అండర్ ట్రయల్ ఖైదీల కోసం నిర్బంధ కాలాల సర్దుబాటు తదితర చట్టాలపై క్లుప్తంగా వివరించారు. నేర న్యాయ ప్రక్రియలో సాంకేతికత అనుసంధానం ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. అంతకు ముందు శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ ఇ.దామోదర్ గతంలో నెల్లూరు ఎస్పీగా పని చేసే సమయంలో ఆయనతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.

దాడి కేసులో ముగ్గురు అరెస్టు

నాయుడుపేటటౌన్: పట్టణంలో అంగన్‌వాడీ ఆయా కవితపై దాడికి పాల్పడిన ముగ్గురు యువకులను శనివారం అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. మద్యం మత్తులో పట్టణానికి చెందిన మునేంద్ర, శంకర్, హరికృష్ణ అంగన్‌వాడీ కేంద్రం వద్ద ఉన్న ఆయాపై శుక్రవారం విచక్షణా రహితంగా దాడికి పాల్పడిన విషయం తెలిసిందే. ఈ కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. నిందితులను న్యాయమూర్తి ఎదుట హాజరు పరిచి రిమాండ్‌కు తరలించనున్నట్లు పోలీసులు వివరించారు.

చదువును మళ్లీ కొనసాగిద్దాం

తిరుచానూరు (చంద్రగిరి): చదువును మళ్లీ కొనసాగిద్దాం.. బంగారు భవితకు బాటలు వేద్దాం అన్న నినాదంతో ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్‌ను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చిందని ఓపెన్ స్కూల్ జిల్లా కో-ఆర్డినేటర్ గురుస్వామి రెడ్డి అన్నారు. తిరుపతి జిల్లాలోని ఓపెన్ స్కూల్ అధ్యయన కేంద్రాల సమన్వయకర్తలకు శనివారం తిరుచానూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఓపెన్ స్కూల్ విధానాన్ని 2008-09 నుంచి ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ప్రవేశాలు పూర్తిగా ఆన్‌లైన్‌లో ఉంటాయన్నారు. ఇంటర్మీడియట్ విద్యను 2010-11 విద్యా సంవత్సరం నుంచి ఓపెన్ స్కూల్ విధానంలో ప్రవేశ పెట్టినట్లు తెలిపారు. అనంతరం ఓపెన్ స్కూల్ ప్రాముఖ్యతను వివరిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో తిరుపతి జిల్లా డీఈఓ డాక్టర్ శేఖర్, తిరుపతి అర్బన్ మండల ఎంఈఓ భాస్కర్ నాయక్, తిరుపతి రూరల్ ఎంఈఓ బి దేవరాజులు, కె శంకరయ్య, జిల్లాలో అధ్యయన కేంద్రాల సమన్వయ కర్తలు, డీఈవో కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం ట్రస్ట్‌కు రూ.కోటి విరాళం



బెంగళూరు, హైదరాబాద్‌కు చెందిన సుమధుర గ్రూప్స్ సంస్థ సీఎండీ మధుసూదన్, వైస్‌చైర్మన్ కేవీ రామారావు టీటీడీ అన్న ప్రసాదం ట్రస్టుకు ఒక కోటి రూపాయలు విరాళంగా అందించారు. ఈ మేరకు దాతలు విరాళం డీడీని శనివారం తిరుమలలో టీటీడీ అదనపు ఈఓ సీహెచ్ వెంకయ్య చౌదరికి అందజేశారు. సంస్థ డైరెక్టర్లు భరత్ కుమార్, నవీన్‌కుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు. – తిరుమల

మహిళా పోలీసులకు క్యాన్సర్‌పై అవగాహన

తిరుపతి క్రైమ్: జిల్లాలోని మహిళా పోలీసులకు వారి కుటుంబ సభ్యులకు ఉచిత క్యాన్సర్ అవగాహన, స్క్రీనింగ్ కార్యక్రమాన్ని ఎస్పీ సుబ్బరాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. తిరుపతిలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్లో టాటా ట్రస్ట్ క్యాన్సర్ ఫ్రీ ఇండియా వారి ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్ అవగాహన స్క్రీనింగ్, నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా మహిళా పోలీస్ సిబ్బంది వారి కుటుంబ సభ్యులు నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ, ముఖద్వార క్యాన్సర్లకు సంబంధించిన పరీక్షలు నిర్వహించారు. ఈ వైద్య శిరానికి 204 మంది మహిళలు హాజరయ్యారు. ఇందులో ఎస్పీ సుబ్బరాయుడు మాట్లాడుతూ, నేటి ఆధునిక సమాజంలో పని ఒత్తిడి, కల్తీ ఆహారం ప్రభావంతో వయసు నిమిత్తం లేకుండా క్యాన్సర్ బారిన పడుతున్నారని చెప్పారు. సాధారణంగా పని ఒత్తిడి వలన వారి ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోకపోవడం కూడా ఒక కారణమని పేర్కొన్నారు. ఎన్ని సమస్యలు ఉన్నా ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని జాగ్రత్తగా కాపాడుకోవాలని తెలిపారు. ఎన్ని పనులు ఉన్నా కూడా ముందుగా ఇలాంటి కార్యక్రమంలో పాల్గొని వైద్య పరీక్షలు చేసుకోవడం చాలా మంచిదని తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్పీలు విమల కుమారి, వెంకటరావు, పోలీస్ యూనిట్ డాక్టర్ మాధురి, డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.



మహిళను పరీక్షిస్తున్న వైద్యులు

తహసీల్దార్లకు పోస్టింగులు

తిరుపతి అర్బన్: జిల్లాలోని తహసీల్దార్లకు శనివారం రాత్రి పోస్టింగులను ఖరారు చేశారు. జిల్లా నుంచి ఎన్నికల సమయంలో వెళ్లి తిరిగి వచ్చిన 44 మందికి మండలాల వారీగా పోస్టులు కేటాయించారు. జిల్లాలో 34 మండలాలు ఉన్నప్పటికి 31 మండలాలకు కేటాయించారు. తిరుపతి రూరల్, డక్కిలి, దొరవారి సంత్రం మండలాలకు మాత్రం కేటాయించలేదు. ఆ మేరకు తిరుపతి అర్బన్‌కు కేపీ భాగ్యలక్ష్మి, చంద్రగిరికి ఏ.శివరామసుబ్బయ్య, పాకాలకు జే.నిత్యానందబాబు, ఆర్సీపురానికి కే.వెంకటరమణ, వడమాలపేటకు ఎస్.జరీనా, పుత్తూరుకు వి.సురేష్ బాబు, ఎర్రావారిపాళెంకు జే.పరమేశ్వర స్వామి, చిన్నగొట్టిగల్లుకు కే.జనార్దన్‌రాజు, శ్రీకాళహస్తికి డీ.లక్ష్మీనారాయణ, తొట్టంబేడుకు యు.మధుసూదన్‌రావు, రేణిగుంటకు జీసీ వెంకటేశ్వర్లు, ఏర్పేడుకు ఎం.భార్గవి, కేవీబీపురానికి యు.దస్తగిరయ్య, నాగలాపురానికి ఎం.హనుమాన్ నాయక్, పిచ్చాటూరుకు వై.రమేష్‌బాబు, నారాయణవనానికి ఎం.జయరాములు, బీఎస్ కండ్రిగకు ఐ.సుబ్రమణ్యం, వరదయ్యపాళెంకు పి.రాజశేఖర్, సత్యవేడుకు టీవీ సుబ్రమణ్యం, ఓజిలికి ఏ.పద్మావతి, నాయుడుపేటకు పి.గీతావాణి, పెళ్లకూరుకు పి.అనురాధ, సూళ్లూరుపేటకు ఎస్.నరసింహారావు, తడకు బి.పద్మావతి, గుడూరుకు, ఎస్.చంద్రశేఖర్, చిల్లకూరుకు కే.రవికుమార్, కోటకు కే.జయజయరావు, వాకాడుకు ఎస్.రామయ్య, చిట్టమూరుకు ఐఎస్.ప్రసాద్, బాలాయపల్లికి కేవీఆర్వీ ప్రసాద్‌రావు, వెంకటగిరికి ఐ.మునిలక్ష్మిని నియమించారు.

డివిజనల్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లు

తిరుపతికి ఝాన్సీలక్ష్మి, శ్రీకాళహస్తికి సీ.శ్రీదేవి, సూళ్లూరుపేటకు ఎస్. ద్వారకానాథరెడ్డికి కేటాయించారు.

కలెక్టరేట్‌లో తహసీల్దార్లు:

పి.భారతి, పి.శిరీష, కే.కుప్పయ్య, ఎం.రోసయ్య, పీ.లక్ష్మీనరసింహం, బీఆర్‌కే శివప్రసాద్‌ను నియమించారు. ఎండోమెంట్ స్పెషల్ తహసీల్దార్లుగా ఆర్.వెంకటలక్ష్మమ్మ, వీఎస్‌వీఆర్ కృష్ణ నియమితులయ్యారు.

జిల్లాలో పలువురు సీఐల బదిలీ

చిత్తూరు అర్బన్: జిల్లాలో పని చేస్తున్న పలువురు సీఐలను బదిలీ చేస్తూ కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన ఇచ్చిన ఉత్తర్వుల మేరకు బదిలీ అయిన వారిలో పాకాల సీఐ ఎం.రాజగోపాల్‌ను బద్వేలుకు, తిరుపతి ఎస్సీ ఎస్టీ సెల్‌లో పనిచేస్తున్న ఎ.చాన్‌బాషాను మదనపల్లె టూటౌన్‌కు బదిలీ చేశారు. తిరుమల సీసీఎస్‌లో ఉన్న కే.రెడ్డిశేఖర్‌రెడ్డిని కలికిరికి, శ్రీసిటీలో ఉన్న చిన్న పెద్దయ్యను అన్నమయ్యకు, తిరుపతి సీసీఎస్‌లో ఉన్న పి.రామకృష్ణను అన్నమయ్య జిల్లాకు స్థానచలనం కల్పించారు.

మానవ హక్కులను కాపాడండి

- రాజకీయ కక్షలతో దాడులకు తెగబడుతున్నారు
- జాతీయ మానవహక్కుల కమిషన్ చైర్ పర్సన్‌కు చెవిరెడ్డి ఫిర్యాదు

తిరుపతి రూరల్: ''ఏపీలో కొత్త ప్రభుత్వం వచ్చాక చంద్రగిరిలో మానవ హక్కులకు భంగం కలిగిస్తూ రాజకీయ కక్షలతో భౌతిక దాడులకు తెగబడుతున్నారు. అధికార పార్టీ ఆగడాలకు కొంత మంది ప్రభుత్వ అధికారులు కూడా సహకారం అందిస్తుండడంతో పరిస్థితి దారుణంగా ఉంది.. దయచేసి చంద్రగిరి నియోజకవర్గంలో మానవ హక్కులకు భంగం కలగకుండా కాపాడండి'' అంటూ మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి జాతీయ మానవ హక్కుల కమిషన్ చైర్‌పర్సన్ విజయ భారతి సయానీకి విన్నవించారు. తిరుమల శ్రీవారి దర్శనార్థం వచ్చిన ఆమెను శనివారం తిరుపతి పద్మావతీ అతిథి గృహంలో మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి కలిశారు. రెండు నెలలుగా చంద్రగిరి నియోజకవర్గంలో అధికార టీడీపీ నేతలు చేసిన దౌర్జన్యాలు, విధ్వంసాలను ఆమెకు వివరించారు. పలు గ్రామాల్లో ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేశారని, అందులో కొంత మంది ప్రభుత్వ అధికారుల పాత్ర కూడా ఉందన్నారు. ప్రజల ప్రాథమిక హక్కులను హరించడమే కాకుండా వారి ఇళ్లపై దాడులు చేసి ధ్వంసం చేసి భయానక వాతావరణాన్ని సృష్టిస్తున్నారని విన్నవించారు. మానవ హక్కులకు భంగం కలుగుతున్న తీరును తెలుసుకునేందుకు ఎన్‌హెచ్‌ఆర్‌సీ కమిటీ సభ్యులను చంద్రగిరికి పంపించాలని విజ్ఞప్తి చేశారు. సాక్ష్యాధారాలతో పాటు వినతి పత్రాన్ని అందించారు. దీనిపై స్పందించిన చైర్‌పర్సన్ విజయ భారతి సయానీ విచారణకు ఆదేశించి పౌర హక్కులకు భంగం కలిగించిన వారిపై తప్పకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రత్యేకంగా హెచ్‌ఆర్‌సీ కమిటీని త్వరలో చంద్రగిరికి పంపుతామని ఆమె చెవిరెడ్డికి హామీ ఇచ్చారు.



వినతిపత్రం అందిస్తున్న చెవిరెడ్డి